వారపు సంతలో పారిశుద్ధ్యం తొలగింపు

విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర-డుంబ్రిగుడ : మండలంలోని అరకు వారపు సంతలో ప్లాస్టిక్ వ్యర్థాలతో పారిశుద్ధ్యం పేరుకుపోయి ఉంది.దీంతో ఈనెల 14న సంతలో "పేరుకుపోయిన అపరిశుద్ధ్యం, పట్టించుకోని పంచాయతీ అధికారులు: విశాలాంధ్ర దినపత్రికలో ప్రచురితమైన శీర్షికకు" స్పందించిన స్థానిక పంచాయతీ కార్యదర్శి వల్లి శనివారం వారపు సంతలో సందర్శించి పేరుకుపోయిన పారిశుద్ధ్యన్ని తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కార్యదర్శి వల్లి మాట్లాడుతూ వారపు సంత జరిగే పరిసరాల్లో ఎప్పటికప్పుడు ప్రతి వారం పారిశుధ్యం నిల్వ ఉండకుండా తొలగింపు చర్యలు చేపడుతున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చట్రాపల్లి బాధితులకు ఉపాధ్యాయ సంఘాల సాయం

విశాలాంధ్ర-జీకే విధి : చట్రాపల్లి బాధితులకు ఉపాధ్యాయ సంఘాలు తమ వంతు సహాయం అందించారు. గూడెం కొత్త వీధి మండల విద్యాశాఖ అధికారులు ఆధ్వర్యంలో అన్ని ఉపాధ్యాయ సంఘాలు శనివారం బాధితులకు నిత్యవసర సరుకులు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు తగ్గి సత్యనారాయణ, రామన్న, సంఘాల నేతలు కామేశ్వర రావు, రాజారావు, రామరాజు, పెద్దబ్బాయి, విరయ్య దొర, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన్నంగా మారిన రోడ్డు

ప్రయాణం నరకప్రాయం... అవస్థల్లో వాహన చోదకులు...

విశాలాంధ్ర-దేవీపట్నం : రెండు మండలాలు మధ్య రహదారి మార్గం. అటు మైదాన ప్రాంతం తూర్పు గోదావరిని ఇటు అల్లూరి జిల్లా ఏజన్సీ ప్రాంతం మధ్యన సుమారు మూడు గ్రామాలు నిత్యం కోరుకొండ రాజమండ్రి వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు దగ్గర మార్గంగా ఉన్న మార్గం. ఇరువైపులా పట్టించుకోక ఆయా గ్రామాల మధ్య రోడ్డు అద్వాన్నంగా మారటంతో ఆ రోడ్డులో పయనించే వాహన చోదకులు తీవ్ర అవస్థలుపడుతున్నారు.పట్టణ ప్రాంతాలు అందిపుచ్చుకున్నట్టు ఉండే దగ్గర మార్గం. ప్రభుత్వాలు మారుతున్న ఆరోడ్డు దుస్థితి మారటంలేదని ఇందుకూరుపేట గోపాలపురం ఇంటికాయల పల్లి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షా కాలం వస్తే అడుగడుగునా గోతులతో దుర్భజ్యంగా మారి తీవ్ర అవస్థలు కల్గిస్తుంది. ఇందుకూరుపేట పరిసర గ్రామాల ప్రజలకు ఎంతో ప్రయోజనం కల్గించే ఈ రోడ్డు మార్గంను మారమ్మత్తులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సంతల్లో అనధికార విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు : ఏవో నీలవేణి

విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర-డుంబ్రిగుడ : ఈనెల 14న విశాలాంధ్ర దినపత్రికలో వారపు సంతల్లో జోరుగా నకిలీ విత్తనాలు విక్రయాలు మోసపోతున్న గిరి రైతులు పట్టించుకోని అధికారులు అనే శీర్షికపై స్పందించిన స్థానిక మండల వ్యవసాయ శాఖ అధికారిని నీలవేణి శనివారం మండలంలోని డుంబ్రిగూడ గుంటసీమ అరకు, కించుమండ ప్రధాన కేంద్రాల్లో సందర్శించి విత్తనాల విక్రయాల షాపులను తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో జరిగే వారపు సంతల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు తీసుకోకుండా అనధికారికంగా నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పదని హెచ్చరించారు. వారపు సంతల్లో సందర్శించి నకిలీ విత్తనాలు విక్రయించవద్దని ఎప్పటికప్పుడు హెచ్చరికలు చేస్తూనే ఉన్నామనిఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పెర్మిలిన్ ఫ్లస్ సబ్బులు పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల చర్మవ్యాధుల నివారణకు పెర్మిలిన్ ఫ్లస్ సబ్బులు పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఐటీడీఏ పరిధిలోని 117 ఆశ్రమ పాఠశాలలో సుమారు 3500 మంది విద్యార్థులు చర్మ వ్యాధులతో బాధపడుతున్నారని గుర్తించి ముందుగా సబ్బులు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ ఆదేశాలమేరకు రూ.5 లక్షల విలువైన సబ్బు లను ఐటిడిఏ కొనుగోలు చేసింది. చర్మవ్యాధులు విస్తరించకుండా నివారణ చర్యలు చేపట్టారు. స్థానిక ఆంగ్ల పాఠశాల విద్యార్థులకు సబ్బులు పంపిణీ చేశారు. అదేవిధంగా దిగుమోదా పుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో చర్మవ్యాధుల నివారణ సభలు పంపిణీ చేశారు.సబ్బులు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎటిడబ్ల్యూ ఎల్.రజిని పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల గర్ల్స్ హాస్టల్‌ను ఏటిడబ్ల్యూఓ సందర్శన

విశాలాంధ్ర-హుకుంపేట : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గర్ల్స్ హాస్టల్‌ను మండల ఏటిడబ్ల్యూ రజని శనివారం సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా వసతి గృహంలో విద్యార్థులకు కల్పించిన మరుగుదొడ్లు తాగునీటి తోపాటు వసతి సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం విద్యార్థులకు పెట్టిన భోజనం మెనూనూ పరిశీలించారు. భోజన మేను ఏవిధంగా అమలు చేస్తున్నారనే దానిపై విద్యార్థిలను ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏ హాస్టల్లో నైనా భోజనంను అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తే సంబంధి త వార్డెన్లు పై చర్యలు తప్పదని ఆమె హెచ్చరించారు. వర్షాకాలంలో రోడ్డుపై పడిన మురుగు నీరు అంత వసతి గృహం లోపల చేరుతుండ దంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆమె చెప్పారు. నూతన బిల్డింగ్ నిర్మాణానికి గతంలో జిల్లా కలెక్టర్ , ఐటీడీఏ పి ఓ దృష్టికి నివేదిక పంపడం జరిగిందని ఆమె తెలిపారు. మరోసారి దీనిపై ఉన్నతాధికార దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ డి కన్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో టెండర్ పూర్తి కాదు... సరైన రీతిలో మెనూ అమలుకు నోచుకోదు

- గురుకుల ఆశ్రమ వసతి గృహ విద్యాలయాలలో నెలకొన్న సమస్య

- స్పందించిన పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాబూరావు

విశాలాంధ్ర-చింతపల్లి : గురుకుల ఆశ్రమ వసతి గృహ విద్యాలయాలలో నెలకొన్న సమస్యలపై పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు వంతల బాబురావు స్పందించారు. శనివారం ఆయన మాట్లాడుతూ గురుకుల ఆశ్రమ వసతి గృహాలలో జూన్ నెలలో వసతి గృహాలు తెరిచినప్పటికీ సకాలంలో టెండర్ ప్రక్రియ పూర్తి చేయకపోవడంతో మెనూ అమలు అస్తవ్యస్తంగా తయారయ్యిందన్నారు. గురుకుల ఆశ్రమాలలో కూరగాయలు, గుడ్లు టెండర్లకు సంబంధించి జూలై 10న టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పిన అధికారులు ఆగస్టు చివరి వారంలో ఏర్పాటు చేసిన టెండర్ల ప్రక్రియను అస్తవ్యస్తంగా నిర్వహించారన్నారు. ఇటువంటి విధానం వలన విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలయ్యే అవకాశం లేదన్నారు. అసలే అధికారుల పర్యవేక్షణ లోపంతో ఉన్న గురుకులాల విషయంలో టెండర్ ప్రక్రియను అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించారని ఆయన ఆరోపించారు. పేపర్ ప్రకటనలో ఇచ్చిన విధంగా ఫీల్డ్ కవర్ టెండర్ ప్రక్రియ జరగలేదని, ఎవరైతే తక్కువకు సమోదు చేస్తారో వారికి ఇవ్వవలసిన టెండర్‌ను, అందుకు విరుద్ధంగా మైదాన ప్రాంతానికి చెందిన వారికి కట్టబెట్టారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు సైతం గిరిజనులపై వివక్షత చూపుతున్నారని, ఇటువంటి అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. చింతపల్లి ఏకలవ్య విద్యాలయానికి సంబంధించి ఫీల్డ్ కవర్ తెరవలేదన్నారు. గత నెల చివరి వారంలో టెండర్ ప్రక్రియ నిర్వహించినప్పటికీ దిశనిర్దేశం లేదని, టెండర్ ప్రక్రియలో కట్టిన వేల రూపాయల డిపాజిట్లకు సంబంధించి టెండర్ దారులకు తిరిగి చెల్లించక పోవడాన్ని ఆయన తప్పుపట్టారు. గిరిజనులు అప్పు చేసి కట్టిన డిపాజిట్ సొమ్మును ఇన్ని రోజులైనా తిరిగి చెల్లించలేదని టెండర్ దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. మా గిరిజన విద్యార్థుల పట్ల పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని అల్లూరి జిల్లా కలెక్టర్ ను కోరుతున్నానన్నారు. లేనిపక్షంలో విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ సంఘాలతో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తానని ఆయన హెచ్చరించారు.

చట్రాపల్లి బాధితులకు అండగా ప్రభుత్వం

మాజీ మంత్రి మణికుమారి, రాష్ట్ర నాయకులు రమేష్, సుబ్బారావు

విశాలాంధ్ర-జికే వీధి : చట్రాపల్లి గిరిజనులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రి మత్యారాస మణికుమారి, రాష్ట్ర కార్యదర్శిలు కిల్లు రమేష్ నాయుడు, కొట్టగుల్లి సుబ్బారావు, రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు సోమేలి చిట్టిబాబు అన్నారు. శనివారం కార్యకర్తలతో కలిసి చట్రా పల్లి గ్రామానికి సందర్శించి పరామర్శించించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న చట్రాపల్లి గిరిజన 37 కుటుంబలకు 5కేజీల బియ్యం, పప్పుదాన్యాలు, నూనె, నిత్యావసర వస్తువులు, దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాట్రాపల్లి గ్రామస్తులకు ప్రభుత్వం అన్నివిధాలగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. గ్రామంలో ప్రతి కుటుంబానికి పక్కా గృహం నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తామన్నారు. అధిక వర్షాలకు ధ్వంసమైన రహదారులు పునరుద్ధరించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. చట్రాపల్లి గిరిజనులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. సీలేరు జీకేవీధి ప్రధాన రహదారి పునరుద్ధరణ పనులు శరవేగంగా జరుగుతున్నా యన్నారు. కొండకు దిగువన ఇళ్లు నిర్మించుకోవడం వల్ల పెను ప్రమాదం జరిగిందన్నారు. భవి ష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రమాదంలేని స్థలాన్ని కేటాహించాలని జిల్లా కలెక్టర్ తో మాట్లాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు మండల అధ్యక్షులు గోలిసింగి సత్య నారాయణ, కొర్ర బలరాం, ముక్కల మహేష్, కోర్రు రామూర్తి,సోమేలి రమణ మూర్తి, సన్యాసిరావు, ముక్కల కళ్యాణి, వెంకట లక్ష్మి, గంగరాజు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మెనూ అమలులో నాణ్యత తప్పనిసరిగా పాటించాలి : ఎమ్మెల్యే రేగం

విశాలాంధ్ర-హుకుంపేట : ఆశ్రమ పాఠశాల వసతి గృహాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న భోజనం మెనూ ఖచ్చితంగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని స్థానిక ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం స్పష్టం చేశారు. మండలంలోని అల్లంపుట్టు గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాలలో విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు బోధన తీరుపై కూడా అడిగి తెలుసుకు న్నారు. అనంతరం వసతి గృహం లో సందర్శించి విద్యార్థులకు వండి పెట్టిన భోజనం పరిశీలించారు. భోజనం పై విద్యార్థులను అడిగి తెలుసుకోగా సక్రమంగా మెనూ అమలు పరచడం లేదంటూ విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన ఈ విషయంపై ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఆ సమయంలో హాస్టల్ వార్డెన్ అందుబాటులో లేకపోవడంతో ఆయన తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భోజనమేను అమలు చేయడంతో పాటు విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తున్న వార్డెన్ పై చర్యలకు జిల్లా కలెక్టర్ దృష్టికి ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

16న విశాఖ నుంచి దుర్గ్‌కు వందే భారత్ రైలు ప్రారంభం

హాల్ట్ కోసం ఎమ్మెల్యే ముమ్మర ప్రయత్నాలు

విశాలాంధ్ర-పార్వతీపురం/టౌన్ : విశాఖపట్నం నుంచి దుర్గ్ వరకు ఏర్పాటుచేసిన వందే భారత్ ట్రైన్‌ను సోమవారం నాడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్‌గా ప్రారంభించ నున్నందున పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో హాల్టు కోసం ఎమ్మెల్యే విజయ్ చంద్ర గుమ్మల ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే సంబంధిత రైల్వే అధికారులను కలిసిన ఆయన రైల్వే మంత్రిని కూడా కలిసి పార్వతీపురంలో హాల్ట్ ఏర్పాటు చేయాల్సిన అవసరం గూర్చి నొక్కాణించి చెప్పారు. ఎంఎల్ఏ విజయ్ చంద్ర బెంగళూరు వెళ్లి రైల్వే కేంద్ర సహాయక మంత్రి సోమన్నను కలిసి వందే భారత్ రైలుకు పార్వతీపురంలో హాల్టివ్వాలని వినతిపత్రంను అందించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. రైలు ప్రారంభం జరిగే నాటికి పార్వతీపురం స్టేషన్ హాల్ట్‌గా ఉంటుందని చెప్పారు. ఇదిలా ఉండగా పార్వతీపురం జిల్లా కేంద్రంలో ఈ వందే భారత్ రైలుకు తప్పనిసరిగా హాల్ట్ ఇవ్వాలని అన్ని వర్గాల ప్రజలు కోరుతున్నారు. దీనివల్ల రాయపూర్ కు రాకపోకలు పెరుగుతాయని తెలిపారు.

దేశ రాజకీయాలపై ఏచూరిది చెరగని ముద్ర

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : దేశ రాజకీయాలపై కామ్రేడ్ సీతారాం ఏచూరిది చెరగని ముద్ర అని సిపిఎం వెల్లడించింది. అనారోగ్యంతో ఢిల్లీలో మృతిచెందిన ఏచూరికి పట్టణ లోని వివేకానంద కాలనీలో కార్యదర్శి బంకరు సూరిబాబు పూలమాల వేసి ఘన నివాళి అర్పించింది.అనంతరం జరిగిన నివాళి సభను ఉద్దేశించి సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు గొర్లి వెంకటరమణ, రెడ్డి వేణుమాట్లాడారు. విద్యార్థి దశ నుండే శాస్త్రీయ భావాలు కలిగిన ఏచూరి వామపక్ష భావజాలంతో ఉండేవారని, తదనంతరం ఎస్ఎఫ్ఐ నాయకునిగా పనిచేసి, ఢిల్లీ విశ్వవిద్యాలయం జేఎన్‌యుకు మూడుసార్లు అధ్యక్షులుగా వ్యవహరించి ఢిల్లీ యూనివర్సిటీలో మతోన్మాదంపై రాజీలేని పోరాటం నిర్వహించారని గుర్తు చేశారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యునిగా, పోలిట్ బ్యూరో సభ్యునిగా, నేడు చనిపోయే వరకు ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారని, రాజ్యసభ సభ్యుడిగా ఉంటూ చట్టసభల్లో బడుగుల వాణి వినిపించేందుకు కృషి చేశారని కొనియాడారు. దేశంలో మతోన్మాదులు దాడులు పెరుగుతున్నప్పుడు, రాజ్యాంగంపై దాడి జరుగుతున్నప్పుడు, లౌకికవాదం బలంగా ఉండాలని కోరుకుంటూనే దాన్ని బలోపేతానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లేందుకు, ఆయన వారసులుగా కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ పట్టణ కమిటీ సభ్యులు బంకురు సూరిబాబు, గౌతమి, నీలిమ, జయలక్ష్మి, కామేశ్వరి రమణమ్మ అప్పమ్మ పాల్గొని నివాళులర్పించారు.

చినమేరంగి సిఐ, ఎస్ఐ రెగ్యులర్ పోస్టులను భర్తీ చేయరా?

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : చినమేరంగి సర్కిల్ ఆఫీసు, చినమేరంగి పోలీస్ స్టేషన్ రెండు ప్రస్తుతం ఇంచార్జిల పరిపాలనలోనే నడుస్తున్నాయి. గతంలో సీఐగా ఉండే మంగరాజుకు బదిలీ కావడంతోఆయన ఆగస్టు 16న రిలీవ్ అయి వెళ్లిపోయారు.చినమేరంగి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఈ. చిన్నంనాయుడు కు శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం పోలీస్ స్టేషన్కు బదిలీ చేయగా ఆయన కూడా ఆగస్టు 25న రిలీవ్ అయి వెళ్లిపోయారు. చినమేరంగి సర్కిల్ ఆఫీస్ ఇన్స్పెక్టర్ గా గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్ పేట సీఐ హరిబాబుకు తాత్కాలికబాధ్యతలు అప్పగించగా, జియ్యమ్మవలస పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి అనిష్ కు చినమేరంగి పోలీస్ స్టేషన్ ఇంచార్జి బాధ్యతలు అప్పగించారు. విశాఖ డిఐజీ, మన్యం జిల్లా ఎస్పీలు దీనిపై దృష్టి సారించి చినమేరంగి సర్కిల్ ఇన్స్పెక్టర్, సబ్ ఇన్స్పెక్టర్ పోస్టులను భర్తీచేయాలని ప్రజలు కోరుతున్నారు.

పొట్టేళ్ల పందాలపై దాడులు

విశాలాంధ్ర-వీరఘట్టం : వీరఘట్టం మండల పరిధి వండువ గ్రామ సమీపములోని మామిడి తోటల్లో చట్ట విరుద్ధంగా నిర్వహిస్తున్న పొట్టేలు పందేలపై శనివారం వేకువ జామున ఎస్సై జి.కళాధర్ ఆధ్వర్యంలో ఆకస్మికంగా దాడులు జరిపి రెండు పుట్టేలతో పాటు నలుగురు వ్యక్తులను అదుపులో తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలు ఎవరైనా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని క్రిమినల్ కేసులు కూడా పెట్టడం జరుగు తుందని హెచ్చరించారు ఈ దాడులలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర శాసనమండలి నియోజకవర్గ అభ్యర్థిగా రఘువర్మ



విశాలాంధ్ర-పార్వతీపురం : 2025 మార్చిలో జరంగనున్న ఉత్తరాంధ్ర శాసనమండలి నియోజకవర్గ అభ్యర్థిగా ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం పాకలపాటి రఘువర్మ అభ్యర్థిత్వాన్ని రాష్ట్ర సంఘం ఏకగ్రీవంగా ఆమోదించినందుకు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేష్, బాలకృష్ణలు హర్షాన్ని ప్రకటించారు. 2019 నుండి నేటి వరకు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండల సభ్యునిగా శ్రీ పాకలపాటి రఘువర్మ చేసిన కృషిని వీరు అభినందించారు. నేటివరకు ఉత్తరాంధ్ర ఆరుజిల్లాల్లోని ఉపాధ్యాయ మరియు అధ్యాపక వర్గాన్ని అనుసరిస్తూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్న రఘువర్మ రానున్న ఎన్నికలలో విజయం వరించేలా సహకరించాలని ఉపాధ్యాయ మరియు అధ్యాపక వర్గాన్ని అభ్యర్థిస్తున్నామని తెలిపారు.

ప్రజారోగ్య సమస్యలపై సత్వరమే స్పందించాలి

డిప్యూటీ డిఎంహెచ్ఓ జగన్మోహన్‌రావు

విశాలాంధ్ర-బెలగాం : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు చేరువయ్యే దిశగా నిశితమైన క్షేత్ర స్థాయి పర్యవేక్షణ అవసరమని డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. ఈమేరకు జిల్లాలో ఆరోగ్య పర్యవేక్షకులకు (సూపర్వైజర్స్) శనివారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపి పలు సూచనలు చేశారు. పలు ఆరోగ్య సమస్యలకు అందుబాటులో ఉన్న ఉచిత వైద్య సేవలు ప్రజలకు సకాలంలో అందేలా ప్రత్యక్ష పర్యవేక్షణ చేయాలని, సిబ్బంది మధ్య సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలని, ప్రజల ఆరోగ్య విషయమై సమస్యలు గుర్తించి తక్షణమే స్పందించాలన్నారు. ఆరోగ్య పర్యవేక్షకులు క్షేత్ర స్థాయికి ఆరోగ్య కేంద్రాలకు మధ్య వారధులుగా ఉండి ఆరోగ్య సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహన్ మాట్లాడుతూ 17వ తేదీన నిర్వహించనున్న డీ వార్మింగ్ కార్యక్రమానికి కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. 1సం. నుండి 19 సం. వరకు అందరి పిల్లలు, విద్యార్థులకు ఆరోజు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. సంబంధిత శాఖలతో ముందుగానే సమన్వయం జరపాలన్నారు. బాలికల్లో రక్తహీనత నివారణ ధ్యేయంగా 10సం. నుండి 19సం. వారికి హీమోగ్లోబిన్ పరీక్షలు నిర్దేశించిన సమయంలో పూర్తి చేసి వివరాలు రికార్డులో నమోదు చేయాలన్నారు. మారుమూల గిరిజన ప్రాంత ప్రజలు జ్వరాల బారిన పడకుండా, వైద్య అవసరాల నిమిత్తం ప్రయాస లేకుండా అక్కడే గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి జ్వర పీడితులకు, దీర్ఘకాలిక, ఇతర వ్యాధి గ్రస్తులకు మెరుగైన చికిత్స అందించాలన్నారు. పిఎం జన్ మన్ కార్యక్రమంలో భాగంగా వివిటిజి గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాలు, వెల్నెస్ కేంద్రాలకు సుదూరంగా ఉన్న గ్రామాలను గుర్తించి అవసరమైన మందులు, పరీక్షలు అక్కడ వైద్య సిబ్బంది వద్ద ఉంచి ప్రతీ నెలా ఆ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆ ప్రాంతంలో నివసించే గర్భిణీలను ప్రసవ తేదీకి ముందుగానే గర్భిణీ వసతి గృహాల్లో చేర్చాలన్నారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించి వారి ఆరోగ్య మెరుగునకు కృషి చేయాలన్నారు. ప్రజారోగ్య విషయమై అంకితభావం, సేవాదృక్పథం అలవర్చుకోవాలని హితవు పలికారు.

పాత పెన్షన్ పథకం అమలు చేయాలి

ఆల్ ఇండియా పోస్టల్ & ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ వినతి

విశాలాంధ్ర-బెలగాం : పాత పెన్షన్ పథకం అమలు చేయాలని, అలాగే పలు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఆల్ ఇండియా పోస్టల్ & ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ పార్వతీపురం డివిజన్ కార్యదర్శి ఎం. వెంకటాచలం పార్వతీపురం డివిజన్ పోస్టల్ సూపరెంటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2003 డిసెంబర్ 22వ తేదీ ముందు వచ్చిన నోటిఫికేషన్ ప్రకారం రిక్రూట్ అయిన వారు ఓపిఎస్ ఎంచుకున్నచో వారి నుంచి ఎటువంటి బకాయిలు వసూలు చేయరాదని, ఎన్.పి.ఎస్ పింఛనుదారులకు సిజిహెచ్ఎస్/ఎఫ్ఎంఎ సదుపాయాలు వర్తింపజేయాలని, సీనియర్ సిటిజన్ ట్రావెల్ కన్సెషన్ వెంటనే పునరుద్ధరించాలని, ఎనిమిదో వేతన సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, 18 నెలల డిఎ బకాయిలు వెంటనే చెల్లించాలని అన్నారు. బిఎస్ఎన్ఎల్ పింఛను దారులకు వెంటనే పింఛను రివిజిన్ చేయాలని, బ్యాంక్ పింఛనుదారులకు కూడా వెంటనే పింఛను రివిజిన్ చేయాలని, కమ్యూటేషన్ పీరియడ్15 సంవత్సరాల నుండి 10.8 సంవత్సరాలకు తగ్గించాలని, జూన్ 30/డిసెంబర్ 31వ తేదీన రిటైరైన అందరికీ నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని అన్నారు. పింఛనుదారులు 80 సంవత్సరాలలో ప్రవేశించిన వెంటనే అదనపు పింఛను ఇవ్వాలని, పింఛనుదారులకు 65 సం నుండి అదనపు పింఛను ఇవ్వాలని, పెన్షనర్ల సంఘం గుర్తింపుకు సరియైన మార్గదర్శకాలు జారీ చేయాలని, నేషనల్ లిటిగేషన్ పాలసీని వెంటనే ప్రకటించాలని వెంకటాచలం డిమాండ్ చేశారు.

రాజీ మార్గమే శ్రేయస్కరం...

- అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సౌమ్యజోస్ఫిన్

- జాతీయ లోక్ అదాలత్‌లో 647 కేసులు పరిష్కారం

విశాలాంధ్ర-బెలగాం : రాజీ మార్గమే శ్రేయస్కరమని పార్వతీపురం అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె. సౌమ్య జోస్ఫిన్ అన్నారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె. సౌమ్య జోస్ఫిన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొత్తం 647 కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించడం జరిగింది. ఈసందర్భంగా అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె. సౌమ్య జోస్ఫిన్ మాట్లాడుతూ లోక్ అదాలత్ అనేది ప్రత్యామ్నాయ వివాద పరిష్కారంలో ఒక భాగమని ఇది న్యాయస్థానంలో వ్యాజ్యానికి ముందు పెండింగ్‌లో ఉన్న వివాదాలు, కేసులను సామరస్యంగా పరిష్కరించుకుని రాజీ చేసుకునేలా చేయడమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కక్షిదారులు కోసమే ఈకార్యక్రమం ఏర్పాట్లు చేయడం జరిగిందని, కోర్టులో కేసు నడుస్తున్నంత కాలం కక్షిదారులు వాయిదాలకు హాజరగుటకు ఎంతో ఖర్చు, ఆరోగ్యం, సమయం వృధా అవుతున్నాయని భావించి కక్షిదారుల శ్రేయస్సు కోసం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. లోక్ అదాలత్ లో ఒక్కసారి కోర్టు సమక్షంలో రాజీ కుదుర్చుకున్నాక మళ్ళీ అదే విషయంపై ఏ కోర్టులోను కేసు వేసే అవకాశం ఉండదన్నారు. కేసులలో రాజీ చేసుకున్నాక ఒక సృహృద్భావ వాతావరణం కల్పించాలని కక్షిదారులను కోరారు. ఇరువురి అంగీకారంతోనే కేసులలో రాజీ చేయడం జరుగుతోందని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ లో సివిల్ ప్రానోట్ కేసులు -6, చెక్ బౌన్స్ కేసులు-3, అమలు పిటిషన్ 01, బిఎస్ఎన్ఎల్ ప్రీ లిటిగేషన్ కేసులు 17, మెయింటినెన్స్ కేసు -1, క్రిమినల్ కేసులు-145, సమ్మరీ ట్రయిల్ కేసులు 474 లను మొత్తం 647 కేసులు ఇరుపక్షాల సమక్షంలో పరిష్కరించామని తెలిపారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు టి. జోగారావు, కె. కూర్మినాయుడు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. చంద్ర కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నల్ల శ్రీనివాసరావు, ఎపిపి చంద్రశేఖర్, న్యాయవాదులు, కక్షిదారులు, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

18న ముగియనున్న వెస్టర్న్ క్యారియర్స్ (ఇండియా) ఐపిఓ

విశాలాంధ్ర-పాడేరు : వెస్టర్న్ క్యారియర్స్ (ఇండియా) లిమిటెడ్ ("కంపెనీ") శుక్రవారం నాడు ఈక్విటీ షేర్ల ప్రారంభ పబ్లిక్ సమర్పణకు సంబంధించి బిడ్/ఆఫర్‌ను తెరిచింది. సమర్పణలో రూ. 4,000 మిలియన్ల ("తాజా ఇష్యూ") వరకు ఈక్విటీ షేర్ల తాజా ఇష్యూ మరియు రాజేంద్ర సేథియా ("ప్రమోటర్ సెల్లింగ్ షేర్‌హోల్డర్") ద్వారా 5,400,000 ఈక్విటీ షేర్‌లు ("విక్రయానికి ఆఫర్"తో కలిపి అమ్మకానికి ఆఫర్) ఉన్నాయి. తాజా సంచిక, "ఆఫర్"). యాంకర్ ఇన్వెస్టర్ బిడ్/ఆఫర్ వ్యవధి సెప్టెంబర్ గురువారం నాడు ఉంటుంది. బిడ్/ఆఫర్ బుధవారం, సెప్టెంబర్ 18, 2024న ముగుస్తుంది. ఆఫర్ ప్రైస్ బ్యాండ్ ఒక్కో ఈక్విటీ షేర్‌కు రూ.163 నుండి రూ. 172 వరకు ఉంటుంది ("ప్రైస్ బ్యాండ్"). కనిష్టంగా 87 ఈక్విటీ షేర్లు మరియు ఆ తర్వాత 87 ఈక్విటీ షేర్ల గుణిజాలలో ("బిడ్ లాట్") వేలం వేయవచ్చు.

ప్రతి ఒక్కరూ హిందీ భాష నేర్చుకోండి

విశాలాంధ్ర-పాలకొండ : పట్టణ పరిధిలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ భాషా దినోత్సవం శనివారంఘనంగా జరిగింది. జాతీయ ఐక్యత కోసం ప్రతీ ఒక్కరూ హిందీ భాషను నేర్చుకోవాలని ప్రధానోపాధ్యాయులు మీసాల సూర్యనారాయణ సందేశమిచ్చారు. హిందీభాషా ఉపాధ్యాయిని సులోచనారాణి హిందీ భాషా పుట్టుపూర్వోత్తరాలు ప్రసంగించారు. సంస్కృత భాషా ఉపాధ్యాయులు బౌరోతు శంకరరావు హిందీ భాషకు సంస్కృత భాషకు ఉన్న సంబంధాన్ని ఉదాహరణాత్మకముగా వివరించారు. సంస్కృత ఉపాధ్యాయులు అనంతరావు నారాయణ రావులు హిందీ భాషా విశిష్టతను చెప్పారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలలో నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా అన్న సమారాధన

విశాలాంధ్ర-చింతపల్లి : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని వీధి వీధినా ఏర్పాటు చేసిన వినాయకుని మండపాల చెంత భక్తుల సహకారంతో నిర్వాహకులు అన్న సమారాధన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. చింతపల్లిలో శనివారం నాలుగు చోట్ల అన్న సమారాధన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. గ్రామంలోని సంత మార్కెట్, రామాలయం వీధి, రాజమ్మ గరువు వీధి, గిరిజన సహకార సంస్థ వద్ద సాయి నగర్ వీధి తదితరచోట్ల నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

బిషప్ తల్లి సీతమ్మ మృతికి పలువురు సంతాపం

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని గెడ్డలుప్పి గ్రామంకు చెందిన బిషప్ సుదర్శనరావుతల్లి పిట్టల సీతమ్మ మృతిచెందారు. సీతమ్మ ప్రథమ కుమారుడు పిట్టల సుదర్శనరావు లూథరన్ సంఘంలో విశాఖ ప్రాంతానికి బిషప్ కావడంతో క్రిష్టియన్ మత పెద్దలు, పాస్టర్లు, క్రిష్టియన్ విశ్వాసులు పెద్దఎత్తున సీతమ్మ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. సీతమ్మ గెడ్డలుప్పి గ్రామపంచాయతీ వార్డు మెంబర్ గా కూడా పనిచేశారు.ఆమె మృతి పట్ల మాజీ ఎంఎల్ఏలు బొబ్బిలి చిరంజీవులు, అలజింగి జోగారావులు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. బిషప్ సుదర్శన రావును కలిసి పరామర్శించారు. వారితోపాటు మండలంలోని పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు కూడా పాల్గొని పరామర్శించారు.

విరివిగా విరాళాలు అందజేయండి

విశాలాంధ్ర-సీతానగరం : విజయవాడ తుఫాను బాధితులకోసం మండలంలోని టిడిపి అభిమానులు, నాయకులు, కార్యకర్తలు విరివిగా విరాళాలు అందించాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పెంట సత్యంనాయుడు, రౌతు వేణుగోపాల నాయుడులు కోరారు. ఆదివారంనాడు ఎమ్మెల్యే విజయ్ చంద్ర పార్వతీపురంకు చేరుకోనున్న సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు ,అభిమానులు, విరాళాలు ఇచ్చేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇంతవరకు మండలంనుండి కాశాపేటకు చెందిన తెంటు వెంకటఅప్పలనాయుడు 25వేలు, చెల్లము నాయుడువలస నుండి 22వేలు, అంటిపేటకు చెందిన పైల నాగభూషణరావు 10వేలు, లక్ష్మీపురం నుండి 15వేలు, తామరకండి నుండి 15వేలు, సుమిత్రాపురం నుండి 10వేలు, ఇప్పలవలస నుండి 10వేలు, గుచ్చిమి నుండి 10వేలు, జోగింపేట నుండి 5వేలు, గెడ్డలుప్పి నుండి 10వేలు,బగ్గందొరవలస నుండి 10వేలు, బక్కుపేట నుండి 10వేలు, దయానిదిపురం నుండి 5వేలు రూపాయలను టీడీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు అందజేశారని తెలిపారు. మిగతా గ్రామాల నాయకులు తోచిన సహాయంను ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా ఇచ్చి వరద బాధితులను ఆదుకోవాలని కోరారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఘనంగా స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం

సిఆర్పిఎఫ్ ఆల్ఫా/234 బెటాలియన్ కమాండెంట్ మనోజ్ కుమార్ యాదవ్

విశాలాంధ్ర-చింతపల్లి : వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత తోనే ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం సంప్రాప్తిస్తుందని సిఆర్పిఎఫ్ ఆల్ఫా/234 బెటాలియన్ కమాండెంట్ మనోజ్ కుమార్ యాదవ్ అన్నారు. జీకే వీధి మండలం పెదవలసలో సిఆర్పిఎఫ్ ఆల్ఫా/234 పటాలానికి చెందిన పోలీసులు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంను శనివారం ఘనంగా నిర్వహించారు. ఏఓపి పెదవలసలో సిఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ గిరిజా శంకర్ రావత్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఆర్పిఎఫ్ ఆల్ఫా /234 పటాలానికి చెందిన కమాండెంట్ మనోజ్ కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. పెదవలస, లక్కవరపుపేట సర్పంచ్‌లు వంశీకృష్ణ, కంకిపాటి వీరేంద్ర ప్రసాద్ లతో కలిసి స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సిఆర్పిఎఫ్ పోలీసులతో కలిసి చెత్తను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛత హి సేవా కార్యక్రమం ద్వారా చెత్తను శుభ్రం చేసుకోవడం శుభ పరిణామం అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పంచాయతీల ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు, సిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న వినాయకచవితి నిమజ్జనాలు, అన్నదాన సంతర్పణలు

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. పలు గ్రామాల్లో గత మూడు రోజుల నుండి విరివిగా అన్నదాన కార్యక్రమాలు కూడా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. పోలీసులు విధించిన ఆంక్షలతో అనుపోత్సవాలు ఆర్భాటము లేకుండా డెక్‌ల ద్వారా పటాస్ సామాగ్రితో యువత ఆధ్వర్యంలో స్వర్ణముఖినదిలోనిమజ్జనాలు చేస్తున్నారు. శుక్రవారం నాడు సీతానగరంలో వెలమవారి వీధిలో ఘనముగా వినాయకునికి పాలాభిషేకమును నిర్వహించారు. తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. కమిటీ అధ్యక్షులు చెలికాని వెంకటగోపాలకృష్ణ కార్యదర్శి ఎస్.కన్నారావుల ఆధ్వర్యంలో ఈకార్యక్రమం జరిగింది.శనివారంనాడు సీతానగరం దేవరవీధిలో, అప్పయ్యపేట కాసాపేట తదితరగ్రామాల్లో అన్నసంతర్పణ కార్యక్రమాలు, నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం స్థానిక కుమ్మరవీధిలో వినాయకునికి పెద్దఎత్తున పాలాభిషేకమును నిర్వహించి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఆదివారంనాడు సీతానగరం మండల కేంద్రంలోని సుంకర వీధిలో, సోమవారంనాడు వెలమవారివీధిలో, మంగళవారంనాడు కుమ్మర వీధిలో పెద్ద ఎత్తున అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. ఆయారోజుల్లోనే నిమజ్జన కార్యక్రమాలు కూడా పెద్దఎత్తున చేయడానికి కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే ఆదివారంనాడు చాలా గ్రామాల్లో వారాల పండుగ ఉన్నవేళ వినాయక చవితి నిమజ్జనాలు పూర్తి చేస్తున్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో, నిమజ్జనాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, అశ్లీలకార్యక్రమాలు లేకుండా బందోబస్తును నిర్వహిస్తున్నట్లు ఎస్సై ఎం.రాజేష్, ఏఎస్ఐ లంక శ్రీనివాసరావు తెలిపారు.

స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరోను మాతృ శాఖగా మార్చడం హర్షణీయం

ముఖ్యమంత్రి, ఎక్సైజ్ శాఖ మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన ఎక్సైజ్ శాఖ సిఐ రాజు

విశాలాంధ్ర-చింతపల్లి : స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ను మాతృ (ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్) శాఖగా మార్చడం శుభ పరిణామం అని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ వై రాజు అన్నారు. స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో, ఎక్సైజ్ శాఖల అధికారులు, ఉద్యోగులందరి అభ్యర్థన మేరకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖగా విలీనం చేయడాన్ని స్వాగతిస్తూ స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద సర్కిల్ ఇన్స్పెక్టర్ వై.రాజు తమ సిబ్బందితో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖగా ఉన్న శాఖను గత ప్రభుత్వం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరోగా మార్చిందన్నారు. దీనివలన తమ శాఖ ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. తమ శాఖ ఉన్నతాధికారులు, ఉద్యోగుల అభ్యర్థన మేరకు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ను మాతృ శాఖ అయిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖగా మార్చడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, ఎక్సైజ్‌శాఖ మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి తామంతా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో ఆశాఖ సబ్ ఇన్స్పెక్టర్ కరుణ ప్రసాద్, ఆశాఖ కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీగణపతి ఆలయం నందు అన్న సమారాదన

విశాలాంధ్ర-చింతూరు : చింతూరులోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం లో గణపతి నవరాత్రుల మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం మహా అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని చింతూరు లక్ష్మీ గణపతి ఆలయం కమిటీ నిర్వహించారు. వినాయక చతుర్థి నాడు గణపతి ఆలయంలో వినాయక చవితి సందర్భంగా పది అడుగుల గణపతి ప్రతిమను కొలువు తీర్చి ఈరోజుకు 8 రోజులు విశేష పూజలు అందుకున్నటువంటి గణపతిని సోమవారం నాడు నవరాత్రులు విశేష పూజలు అందుకున్నటువంటి గణపతి అయ్యవారిని చింతూరు పురవీధుల గుండా ఊరేగింపుగా మంగళ వాయిద్యాలు నడుమ మహా ఊరేగింపు నిర్వహించి సోమవారం శబరి నదిలో నిమజ్జన కార్యక్రమం జరుగుతుందని కమిటీ నిర్వాహకులు తెలియజేశారు.ఈ నవరాత్రుల సందర్భంగా చింతూరులోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో ఈరోజు మహా అన్న సమారాధన అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్న సమారాధన కార్యక్రమానికి వేల సంఖ్యలో చింతూరు మండల భక్తులు విశేషంగా వచ్చి ఈ అన్నప్రసాదాన్ని స్వీకరించి లక్ష్మీ గణపతి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

పంట నష్ట పరిహారం వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : పంట నష్ట పరిహారం రైతులకు వెంటనే చెల్లించాలని సిపిఎం మండల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రాజపేట పంచాయతీలో గల తోటపల్లి(మొద్దుల గూడెం) శబరి గోదావరి పొంగి ప్రవహించటంతో వరుద బీభత్సానికి దెబ్బతిన్న పంట పొలాలను శనివారం వరి పొలాలను మండల సిపిఎం బృందం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వరదల మూడుసార్లు రావడంతో వరి పొలాలు పూర్తిగా మునగటంతో పనికిరాకుండా పోయాయని కనీసం తోటపల్లి గ్రామంలోని 90 ఎకరాలు ఉంటుందని శ్రీరామగిరి పంచాయతీలో పది ఎకరాలు మండలం వ్యాప్తంగా చూసుకుంటే 3 వేలఎకరాలు పంట నష్టం జరిగిందని రైతులు సిపిఎం బృందం ముందు వారి సమస్యలను వెల్లబుచ్చారు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం. సత్యనారాయణ మాట్లాడుతూ అధిక వర్షాలు కురవడంతో శబరి గోదావరి పొంగి వరదలు రావడంతో వరి పంట పొలాలు పూర్తిగా మునిగి పోయాయని దేనికి పనికి రావని ఒక్కో ఎకరానికి 20, వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని అట్లాగే మిర్చి పంట నార్మల్ మునగటంతో రైతులు చాలా నష్టపోయారని నష్టపరిహారం ఇవ్వాలని తక్షణమే అగ్రికల్చర్ అధికారులు సర్వే చేసి రైతులకు నష్టపరిహారం అందించాలని సిపిఎం నాయకత్వం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోసిపిఎం నాయకులు సోడి మల్లయ్య, కుంజ కన్నయ్య, జి. లక్ష్మణరావు, టి. కాంతారావు, ప్రకాష్ రావు, రైతులు ముల్లి, సత్యనారాయణ, మడకం మల్లయ్య, పులి చంద్రావు, తదితరులు పాల్గొన్నారు.

మూలగరువు గ్రామాన్ని సర్పంచ్ ఎంపీటీసీ సందర్శన

విశాలాంధ్ర-జీకే విధి : జీకే వీధి మండలలోని పంచాయతీపరిది మూలగరువు గ్రామానికి స్థానిక సర్పంచ్ కుర్ర సుభద్ర, కుర్ర రాజులమ్మ ఎంపిటిసి సందర్శించడం జరిగింది. భారీ వర్షాలకు వచ్చిన నష్టానికి వివరాలు అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. ఆ గ్రామస్తులు ఇచ్చిన వివరాలు ప్రకారం ఐదు ఇల్లులు పూర్తిగా కొట్టుకుపోయాయని గ్రామస్తులు తెలిపారు. స్థానిక సర్పంచ్ మాట్లాడుతూ గ్రామానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందుతాయని సంబంధిత బాధిత గిరిజన కుటుంబాలకు పరామర్శించి ధైర్యం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి సచివాలయ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

అధికారుల ఇష్టారాజ్యం... గాడి తప్పుతున్న ప్రజాపాలన....

విశాలాంధ్ర-దేవీపట్నం : ప్రభుత్వం మారినా అధికారులు ఏపార్టీకి లోబడి ఉద్యోగాలు చేస్తున్నారో తెలియటం లేదు. చేస్తున్న విధి నిర్వహణ పట్ల ఒకింత అంకిత భావం కూడా లేకుండా పోతుంది. ప్రజల చేత ఎన్నికోబడిన ప్రజాప్రతినిధులకు గానీ తీసుకుంటున్న జీతం రాళ్ళ కోసమైనా తగు న్యాయం చేయాలనే సదుద్దేశ్యం అధికారులకు గానీ లేకుండా మండలంలో ప్రజాపాలన జరుగుతుంది. అధికారుల్లో భాద్యతా రాహిత్యం స్పష్టంగా కన్పిస్తుంది. మూడు నెలలకోసారి మండల పరిషత్ పాలకవర్గ సభ్యులైన ఎంపిటిసిలు, పంచాయితీ సర్పంచ్‌లు సమావేశమై పంచాయితీలలో అభివృద్ధి పనులకు అంచనాలు వేయటం చేపడుతున్న పనులను సమావేశం దృష్టికి తీసుకురావటం పరిధిలో లేనివాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసికెళ్లేందుకు తీర్మానాలు చేయటం వంటి కార్యాక్రమాలకు వేదిక సర్వసభ్య సమావేశం. అటువంటిది కోరం లేకుండా ప్రశ్నించే పక్షం లేకుండా మమ అన్పించటం వెనక ఆంతర్యం ఏంటో సమాధానంలేని డాలర్ల ప్రశ్నగా మారింది. ఇంకో విషయం ఏంటంటే ప్రభుత్వం తెలుగుదేశం అయి పాలకవర్గం అంతా వైసీపీ కావటం విశేషం దానికి తోడు గతంలో ఇక్కడ పనిచేసి గత ప్రభుత్వంలో అంతకట్టబడిన ఎంపిడిఓను రాజకీయాలకు అతీతంగా ఏరికోరి మళ్ళీ ఇక్కడకు పోస్టింగ్ వేయించటం మరొక విశేషం. ముంపు గ్రామాల ప్రజలు కష్టాలు అలానే ఉన్నాయి. పంచాయతీ స్థాయిలో పలు సమస్యలు తిష్ట వేసుకొని కూర్చున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రభళుతున్నాయి. పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసింది. అభివృద్ధి పనులు ఆనవాళ్లు కూడా లేవు. వీటన్నింటిని విస్మరించి తూతూ మంత్రంగా ఎవ్వరికి తెలియకుండా గుట్టుచప్పుడు కాకుండా లేదనిపించటంలో ఆంతర్యం ఏంటని పలువురులో విమర్శలు విన్పిస్తున్నాయి. దురదృష్టం ఏంటంటే పాలక తెలుగుదేశం పార్టీ నుంచి పాలకవర్గం ప్రాతినిధ్యం లేకపోవటం. ఎనిమిది మంది ఎంపిటిసిలు ఉన్న పాలకవర్గంలో ఏడుగురు వైసీపీకి చెందిన ఎంపిటిసిలే ఉండడం ప్రభుత్వం మారాకా వాళ్ళు కూడా అంతంత మాత్రంగా వ్యవహరించటం చూస్తుంటే మండల ప్రజలు పరిస్థితి తల్లిదండ్రులు లేని బిడ్డలు చందంగా మారింది. అనేక సమస్యలు మండలాన్ని పట్టి పీడిస్తున్నాయి. మరి ప్రజా సమస్యలకు పరిస్కార వేదిక ఇలా తూతూ మంత్రంగా సాగితే ఎలా అని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గిరిజన సహకార సంస్థ పెట్రోల్ బంకులో అమ్మకాలు నిలిపివేత

అండర్ గ్రౌండ్ ఊరుతున్న నీటి వలన తలెత్తిన సమస్య

విశాలాంధ్ర-చింతపల్లి : స్థానిక గిరిజన సహకార సంస్థ వద్ద ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకులో గత రెండు రోజులుగా పెట్రోలు అమ్మకాలు నిలిపివేశారు. ఇటీవల మన్యంలో కురిసిన భారీ వర్షాలకు బంకులోపలకు ఊటనీరు చేరుతుండడంతో పెట్రోల్ సరఫరాకు అవరోధం ఏర్పడడంతో పెట్రోల్ అమ్మకాలు నిలిపివేశారు. బంకుకు దగ్గరలో ఎతైన కొండ ఉండటం వలన అక్కడ నుంచి బంకు అడుగు భాగంలోకి నీరు చేరింది. లోపటి నీటిని బకెట్లతో సిబ్బందితో బయటకు తీస్తున్నారు. బంకు సూపరిటెండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ బంకు లోపలకు నీరు చేరిన విషయాన్ని జీసీసీ డీఎంకు, హెచ్ పి సి ఎల్ (విశాఖపట్నం) అధికారులకు తెలియజేశామన్నారు. హెచ్పీసీఎల్ అధికారులు శుక్రవారం వచ్చి చూశారని, ట్యాంకులను శుభ్రం చేసే సిబ్బందిని చింతపల్లి పంపిస్తామని తెలిపారన్నారు. పెట్రోల్ ట్యాంకులు అన్నీ క్లీన్ చేసిన తరవాత పెట్రోల్ అమ్మకాలు చేపడతామన్నారు. గతంలో సీలేరు, జీ. మాడుగుల తదితర పెట్రోల్ బంకుల్లోను ఇదే సమస్య ఏర్పడి కొద్ది రోజులు పాటు పెట్రోల్ సరఫరా నిలిపి వేయడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. నీరు కలిసిన పెట్రోలు పాడైపోతుందని దీని వలన పాడైన పెట్రోలు ఖరీదు రూ. లక్షల్లో తాము చెల్లించవల్సివస్తుందని జీసీసీ అధికారులు వాపోతున్నారు.

బాలికల ఆశ్రమ పాఠశాలలో ఘనంగా హిందీ దివాస్ దినోత్సవం

విశాలాంధ్ర-సీతంపేట : ఐటీడీఏ పరిధిలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో హిందీ దివస్ విద్యార్థులతో ఉపాధ్యాయులతో జరుపుకోవడం జరిగినది అని ప్రధానఉపాధ్యాయురాలు పద్మశ్రీ తెలిపారు.విద్యార్థులు ఆటపాటల మధ్య పిల్లలు ఆనందంగా జరుపుకున్నారు, వ్యాసరచన, వక్తృత్వ మరియు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వడం జరిగింది అన్నారు. హిందీ దివస్ సందర్భంగా జిల్లా లెవెల్ వ్యాసరచన పోటీలో పదవ తరగతి చెందిన ఎస్. కళ్యాణికి ప్రథమ బహుమతి వచ్చింది ఆమెకు హిందీ ఉపాధ్యాయులు నీరజ,లక్ష్మణులను ప్రధానోపాధ్యాయిని పద్మశ్రీ హెచ్ డబ్ల్యు ఓ అమల మరియు ఉపాధ్యాయులు హిందీ దివస్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉత్తమ పీడీ ఉపాధ్యాయులు శ్రీనుకు ఘన సత్కారం

విశాలాంధ్ర-సీతానగరం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ గా పనిచేస్తున్న ముప్పాల శ్రీనివాసరావు ఇటీవల జిల్లాస్థాయిలో ఉత్తమ పీడీ ఉపాధ్యాయునిగా ఎంపికై కలెక్టర్, జిల్లా అధికారులు, ఎంఎల్ఏ చేతులమీదుగా సత్కారం పొందిన వేళ స్థానిక పెద్దలు కూడా ఆయనను ఘనంగా సత్కరించారు. వెలమవారివీధిలోని వినాయక ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చెలికాని వెంకటగోపాలకృష్ణ, కన్నారావుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సన్మానించారు.ఎంతోమంది విద్యార్థులను క్రీడాకారులుగా తయారుచేయడంలో శ్రీను మాస్టారు కృషిని కొనియాడారు. ఇంకా ఎంతోమందిని క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దలు సాల హరిగోపాలరావు, సుంకరిపలి ప్రసాదరావు, కంకణాలపల్లి అరవింద్‌కుమార్, దేవురపల్లి కిరణ్ కుమార్, కాంకణాలపల్లి హరనాథ్, అనిల్, తనూజ్ కుమార్, ముప్పాల నాగేశ్వరరావు తదితరులతో పాటు కమిటీ సభ్యులు, యువత పాల్గొన్నారు.

వరద బాధితులు సహాయార్థం నాటక ప్రదర్శనలు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: వరద బాధితుల సహాయార్థం ఈనెల 15వ తేదీ ఆదివారం స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాటక ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుందని శ్రీ వాణి శివాని నాట్యమండలి వ్యవస్థాపకులు బడే శ్రీరాములునాయుడు, అధ్యక్షులు నాగిరెడ్డి సింహాచలం తెలిపారు. ఈ ప్రదర్శనలో మోహిని భస్మాసుర సీను, కాళహస్తీశ్వర మహత్యం, సత్య హరిశ్చంద్ర వారణాసి సీనులు ప్రదర్శించబడతాయన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు బోనెల విజయచంద్ర ముఖ్య అతిథిగా హాజరవుతారని కావున నాటక కళల పట్ల ఆసక్తి గల వారు ఈ ప్రదర్శనలకు హాజరై మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయాన్ని వరద బాధితులకు అందజేయాలని కోరారు.

వేతన బకాయలను చెల్లించాలంటూ గెస్ట్ లెక్చరర్ల నిశ్శబ్ద నిరసన

విశాలాంధ్ర-గంగవరం : తమకు రావాల్సిన వేతన బకాయిలను చెల్లించాలంటూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లు తమ నిశ్శబ్ద నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గెస్ట్ లెక్చరర్ల యూనియన్ పిలుపుమేరకు కాలేజీల్లో ప్రిన్సిపాల్ లకు వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. తమ శ్రమ దోపిడీ జరగకుండా తగి న్యాయం చేయాలని గెస్ట్ లెక్చరర్లు నిశ్శబ్ద నిరసన వ్యక్తం చేస్తూ స్థానిక గంగవరం ప్రిన్సిపల్ కలిమికోట కృష్ణకి వినతి పత్రాన్ని చేశారు. యూనియన్ పిలుపుమేరకు గంగవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ ప్రిన్సిపాల్ కు తమ నిశ్శబ్ద నిరసన పత్రాన్ని ప్రిన్సిపాల్ కు అందించారు. ఏళ్ల తరబడి శక్తి వంచన లేకుండా పనిచేస్తున్న తమకు వేతనాలు అందించడంలో తీవ్ర వ్యత్యాసాన్ని చూపించడం వల్ల తమ శ్రమ దోపిడీకి గురి అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు, అలాగే చాలీచాలని 10000 జీతంతో తమ జీవితాలను వెళ్ల భూచ్చడానికి చాలా ఇబ్బందులు పడాల్సి ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు ఈ కార్యక్రమంలో ఎండి. నఫీజ, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

విలీన మండలాల రైతులపై వివక్ష సరైంది కాదు

నష్టపోతున్న స్థానిక జామాయిల్ రైతులు

విశాలాంధ్ర-కూనవరం : తెలంగాణలోని సారపాకలో ఉన్న ఐటీసీ పేపర్ పరిశ్రమ గతంలో స్థానిక రైతులకు వెన్నుదన్నుగా ఉండేది.ఒకే జిల్లా ఒకే రేటుతో స్థానిక రైతులకు ఒకే రేటు చెల్లించేది. కానీ ఇప్పుడు కొంతమంది పైరవీకారుల కారణంగా ఈ ఐటిసిలో అక్రమాలు కొనసాగుతున్నాయని విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న ఆంధ్ర జామాయిల్ రైతులపై వివక్షత చూపుతున్నారని స్థానిక రైతులు మాజీ ఎంపీపీ పొడియం అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాంతాలను బట్టి రేటు కేటాయించడంతో ఇక్కడి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాంతాలవారీగా రైతులను బట్టి ధర నిర్ణయిస్తూ దళారులు కాంట్రాక్టర్లు ఐటిసి ఉద్యోగులతో కుమ్మక్కయి తమ చేతివటం చూపిస్తున్నారని దానివల్ల ఎక్కువ శాతం రైతులు నష్టపోగా కొద్దిమంది మాత్రం ఎక్కువ ధర చెల్లించడం వల్ల లాభపడుతున్నారని అన్నారు. ముఖ్యంగా విలీన మండలాల రైతులకి టన్నుకి వెయ్యి రూపాయల వరకు తక్కువ ధర చెల్లిస్తుండడం సరైనది కాదని విమర్శించారు. ప్రాంతాల విభేదం లేకుండా రైతులందరికీ సమానధర ఇవ్వకుంటే కొనుగోళ్లలో జరిగే అవకతవకల్ని యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్తామని అప్పారావు హెచ్చరించారు.

వరద బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రంలోని రాజుపేట పంచాయతీలో ప్రభుత్వం పంపించిన గోదావరి వరద సహాయాన్ని శనివారం సర్పంచ్ శారద ఎంపీటీసీ వి. భాగ్యలక్ష్మి చేతుల మీదుగా వరద బాధితులకు ప్రతి కుటుంబానికి 25 కేజీల బియ్యం, కేజీ బంగాళదుంపలు, కేజీ ఉల్లిపాయలు కేజీ కందిపప్పు లీటర్ పాల , గోదావరి వరద బాధితులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముంజపురాము , వరద కమిటీ సభ్యులు రేవు సింహాచలం, వడ్డానపు చిన్న రాజారావు, టిడిపి గ్రామ అధ్యక్షులు పెట్ట ముత్యాలరావు, ఎం భాను, జొన్నాడ నాగేశ్వరరావు, వీఆర్ఏ శేఖర్, వీఆర్వో రమాదేవి, సేల్స్ మెన్ జె రాము, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావుకు విశిష్ట విద్య సేవా పురస్కారం

విశాలాంధ్ర-గంగవరం : ఏజెన్సీ విద్యాశాఖ అధికారి వై మల్లేశ్వరరావుకు చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఏడవ వార్షికోత్సవం సందర్భంగా సూర్య కళామందిర్ కాకినాడలో విశిష్ట విద్య సేవా పురస్కారం ఇవ్వడం జరిగింది. గత ఐదు సంవత్సరాల నుండి చేయూత సేవా సంస్థ చేస్తున్నటువంటి సేవా కార్యక్రమాల్లో ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు సహకారం అందిస్తున్న సేవలను గుర్తించి చేయూత సేవా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ రవికుమార్ వారి ఆధ్వర్యంలో నల్లమిల్లి శేషారెడ్డి వారి భార్య, కోడళ్ళు చేతులమీదుగా ఈ పురస్కారం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఘనంగా సన్మానించారు.

సర్వం కోల్పోయిన బాధితులకు సరుకుల వితరణ

చట్రాపల్లి వరద బాధితులకు అన్ని వర్గాల నుంచి అండ

చిరు సాయం అందించిన ప్రజలు

విశాలాంధ్ర-చింతపల్లి : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో గత శని, ఆదివారాలలో ఎడతెరిపి లేకుండా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడి సర్వం కోల్పోయిన చట్రాపల్లి గ్రామస్తులకు ప్రజలు విరివిగా విరాళాలు సేకరించి నిత్యవసర సరుకులు, వంట పాత్రలు, దుస్తులు తదితర వాటితో అండగా నిలిచారు. విడువకుండా రెండు రోజులపాటు కురిసిన వర్షానికి కొండ చరియలు విరిగిపడి సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు రాజకీయ పార్టీలకు అతీతంగా, మానవత్వం కలిగిన వ్యక్తులంతా తమకు తోచిన సహాయం అందజేశారు. ప్రభుత్వం తరపున గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆ ప్రాంతాన్ని సందర్శించి మృతురాలు కుమారి కుటుంబానికి 5 లక్షల రూపాయల నష్టపరిహారం ప్రకటించడంతోపాటు, బాధితులను అన్ని విధాల ఆదుకుంటామని భరోసా కల్పించారు. అనంతరం వైకాపా అరకు ఎంపీ గుమ్మ తనుజ రాణి, ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, వైకాపా అల్లూరి జిల్లా అధ్యక్షురాలు కొట్ట గుల్లి భాగ్యలక్ష్మి తదితరులు, సిపిఐ పార్టీ నుంచి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ, ఆ పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి పోట్టిక సత్యనారాయణ, ఇతర పార్టీలకు చెందిన నాయకులు, చింతపల్లి జి కే వీది మండలాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు చట్రా పల్లి గ్రామాన్ని సందర్శించి బాధితులకు నిత్యవసర సరుకులు, వంట సామాగ్రి, దుస్తులు తదితర సహాయ సహకారాలు అందించారు.

పచ్చదనం, పరిశుభ్రత రెండవ విడత కార్యక్రమం

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం నియోజకవర్గ ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర ఆదేశాల మేరకు పచ్చదనం పరిశుభ్రత రెండవ విడత కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం మండలం పెదబొండపల్లి గ్రామంలో శనివారం తామర చెరువు ప్రధాన రోడ్డు గట్టుపైన టీడీపీ యువకులు ఎంతో ఉత్సాహంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే రోడ్డు పక్కన ఉన్న పిచ్చి మొక్కలు ఉన్న డొంకలను తుప్పలను ముందుగా వెళ్లి హనుమాన్ కాలనీ ప్రజలు పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో వంగపండు శ్రీను, యండ్రాపు ప్రవీణ్, చోడరపు చిరంజీవి, చుక్క సంతోష్, చుక్క ప్రభాకర్, కె. ప్రశాంత్, రత్న, దుర్గ, పండు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలలో నేత్ర వైద్యం సృష్టికర్త డాక్టర్ శివారెడ్డి

విశాలాంధ్ర-బెలగాం : దేశం గర్వించ దగ్గ నేత్ర శస్త్ర చికిత్స నిపుణులుగా ప్రసిద్ధి గాంచిన డా. శివారెడ్డి జయంతి సందర్భంగా రాష్ట్ర నేత్ర వైద్య అధికారుల సంఘం ఘనంగా నివాళులర్పించి అతను చేసిన సేవలు గుర్తు చేసుకొని అతని అడుగుజాడల్లో సేవలు చేయాలని నిర్ణయించారు. ఈసందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్య అధికారి డా. జీరు నగేష్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ పెరుగు శివారెడ్డి కర్నూలు జిల్లాలో దిన్నెదేవరపాడు గ్రామంలో 1920 సెప్టెంబర్ 12వ తేదీన జన్మించి 1946లో మద్రాస్ విశ్వవిద్యాలయంలో ఎంబిబిఎస్ పూర్తి చేసి,1952లో ఎంఎస్ పట్టాని పొంది మద్రాస్ వైద్య సర్వీస్ లో సహాయ సర్జన్ గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి ఆంధ్ర వైద్య కళాశాలలో సహాయ ప్రొఫెసర్ గా, ఉస్మానియా వైద్య కళాశాలలో ప్రొఫెసర్ మరియు సూపరి%శీ%టిండెంట్ గా పనిచేసి రాష్ట్ర ప్రభుత్వ సర్వీసు లో డైరెక్టర్ గా పనిచేసారని, తను అనేక దేశాలు పర్యటించి గౌరవప్రదమైన సేవలు అందించారన్నారు. తన స్నేహితులు అమెరికాలో స్థిరపడి డబ్బులు బాగా సంపాదించొచ్చని వొత్తిడి చేసినా నేను ఇండియాకు సేవలు అందించాలని ఇండియాలోనే వుండి పోయారని, మూడు దశాబ్దలపాటు నేత్ర వైద్యం అందించి ఎంతో మంది పేదలకు కంటిచూపు కలిగే భాగ్యం కలిగించారని, ఇప్పటికీ ఇతని శిష్యులు దేశ విదేశాలలో నేత్ర వైద్య నిపుణులుగా సేవలందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అనేక గ్రామాలలో అంతర కుసుమం (కేటరాక్ట్) తో భాదపడుచున్నారని గ్రహించి దేశంలోనే ప్రథమంగా ఉచిత నేత్ర వైద్య శిబిరాలు పెట్టి ప్రజలను చైతన్య పరచి శస్త్ర చికిత్సలు చేసారని, దాదాపు 500 శిబిరాలు నిర్వహించి మూడు లక్షల ఆపరేషన్లు చేసి గిన్నిస్ బుక్ రికార్డు సాధించారని, ఈ ప్రక్రియలో భాగంగా స్వంత డబ్బులు ఖర్చు పెట్టి మొబైల్ సేవలు అందించారని తెలిపారు. భారతదేశంలో అత్యున్నత హోదాలలో వున్నవారికి శస్త్ర చికిత్సలు చేసి కంటిచూపును కాపాడారని, ఆంధ్రప్రదేశ్ లో మొట్టమొదటి నేత్ర నిధి (ఐ బ్యాంక్) 1964 లో స్థాపించి ఎంతో మందికి చూపునిచ్చారని, ఆయన దేశంలో పద్మశ్రీ, పద్మభూషణ్ విదేశాల్లో బిసి రాయ్ అవార్డు, జీన్ రిసెల్ అవార్డు, అడెన్వాల ఓలేషన్ గోల్డ్ మెడల్ ఇంకా ఎన్నో అందుకున్నారని తెలిపారు. ఈయన రాష్ట్రంలో తొలిసారిగా ప్రభుత్వంతో కర్నూలు, విశాఖపట్నం, వరంగల్ లలో ప్రాంతీయ నేత్ర వైద్యశాలలు ఏర్పాటు చేయించి గ్రామాలలో నేత్ర వైద్య సేవలు అందించడానికి బాటలువేశారని, తను వైద్యంతో పాటు సామాజిక సేవలు, గ్రంథ రచనలు, సైంటిఫిక్ వ్యాసాలు వ్రాసేవారు. ఈయన నేత్ర వైద్య రంగానికి అసమాన సేవలందించి 2005 ఆగస్టులో పార్కిన్సన్ వ్యాధికి గురై సెప్టెంబర్ 6వ తారీఖున గుండెపోటుతో మరణించారని తెలిపారు. తన 85 సంవత్సరాల జీవితం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాతగా నిలిచిన డాక్టర్ పెరుగు శివారెడ్డి తెలుగు వారికి గర్వకారణం, చిరస్మరణీయుడని, అతని జయంతిని

పురస్కరించుకొని జిల్లా అంధత్వ నివారణ సంస్థ కార్యాలయంలో జిల్లాలో పనిచేస్తున్న నేత్ర వైద్య అధికారులు, సహాయకులు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న నేత్ర వైద్య నిపుణులు అందరూ స్మరించుకుని అతను చేసిన సేవలను గుర్తెరిగి అందరూ నేత్ర వైద్య సేవలు అందించాలని, పజలందరికి కంటి చూపు మెరుగు పరిచే విధంగా పనిచేస్తామని జిల్లా అందత్వ నివారణ సంస్థ నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి నేత్ర వైద్య సేవలు అందించాలని, పజలందరికి కంటి చూపు మెరుగు పరిచే విధంగా పనిచేస్తామని జిల్లా అందత్వ నివారణ సంస్థ నేత్ర వైద్య అధికారి డా. జీరు నగేష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నేత్ర వైద్య సిబ్బంది అందరూ పాల్గొన్నారు.

శంబరపోలమాంబ తల్లిని దర్శించుకున్న కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం : ఉత్తరాంధ్ర ప్రజలఆరాధ దేవత, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శంబర పోలమాంబ తల్లిని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ దర్శించుకున్నారు. 2025 జనవరి నెలలో జరగనున్న శంబర జాతరలో సామాన్య భక్తులకు ఎటువంటి యిబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. జాతర ఏర్పాట్లపై ఆలయ ఆవరణలో దేవాదాయశాఖ అధికారులు, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, దేవాలయ కమిటీ, ఆర్ డబ్ల్యూ ఎస్,పంచాయతీ రాజ్, వైద్య తదితరశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతా సమన్వయంతో సమర్థవంతముగా జాతరను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలోపార్వతీపురం ఆర్డీఓ కె.హేమలత, డ్వామా పిడి, జిల్లా పంచాయతీ అధికారి కె.రామచంద్రరావు, జిల్లా దేవాదాయ శాఖ కమిషనర్ కే.ఎల్. సుధారాణి, ఈవో వెంకట సూర్యనారాయణ, తహసిల్దార్ షేక్ ఇబ్రహీం, ఎంపీడీవో లక్ష్మి కాంత్, ఆర్డబ్ల్యూఎస్ డీఈ సిహెచ్. వెంకట అప్పలనాయుడు, ఐటిడిఏ డిఇ మణిరత్నం, పంచాయతీరాజ్ డిఇ చిన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగలు దాడిలో ముగ్గురికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-ముంచింగిపుట్టు : మండల పరిధిలో గల సుజానకోట గ్రామంలో శనివారం జరిగిన సంఘటలో స్మశాన వాటికలో బంధువు అంత్యక్రియలు నిర్వహిస్తుండగా ఆకస్మాత్తుగా తేనెటీగలు దాడి చేయడంతో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచింగిపుట్టు మండలం సుజనకోట పంచాయితీ కేంద్రంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి ప్రత్యేక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. శనివారం సుజనకోట గ్రామానికి చెందిన వెంగడ గాసమ్మ అనే వృద్ధురాలి మృతి చెందింది. దీంతో దానసంస్కారాలు నిర్వహించేందుకు సమీపంలోని స్మశానవాటిలో కుటుంబ సభ్యులు, వారి బంధువులు, అభిమానులు హాజరయ్యారు. ఈ క్రమంలో ఒక్కసారిగా తేనెటీగలు ఆకస్మికంగా హాల్ చల్ చేయడంతో వారందరూ పరుగులు తీశారు. అప్పటికే అంత్యక్రియలకు హాజరైన స్థానిక సర్పంచ్ వి.రమేష్, అదే గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ఎస్ రాజు, సచివాలయ ఉద్యోగి ఎస్.దేవేంద్రుడు కు దాడి చేశాయి. ఈ దాడిలో సర్పంచ్ రమేష్ కు తీవ్రగాయాలయ్యాయి. మిగిలిన వారికి స్వల్పగాయలు కావడంతో స్థానికులు హుటాహుటిన ముంచింగిపుట్టు సిహెచ్సికి తరలించారు. వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్య సిబ్బంది తెలిపారు.

నాల్గవ రోజుకు చేరిన స్టాఫ్ నర్సుల నిరసన

విశాలాంధ్ర-బెలగాం : కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయకుండా కొత్తగా రిక్యూట్‌మెంట్ చేపట్టడంపై కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు పార్వతీపురం మన్యం జిల్లా ఆసుపత్రి ఆవరణలో నాలుగవ రోజు శనివారం నల్ల బేడ్జీలు ధరించి తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 115 ద్వారా తమకు అన్యాయం జరుగుతుందని, సచివాలయాలలో పని చేస్తున్న ఎఎన్ఎంలకు శిక్షణ ఇచ్చి స్టాఫ్ నర్సులుగా ఉద్యోగోన్నతి కల్పించాలనికోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల అసోషియేషన్ నాయకులు మాట్లాడుతూ గత 15, 16 సంవత్సరాల నుంచి రెగ్యూలర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా తమ పట్ల చిన్నచూపు చూస్తున్నారని, 2011నుండి రెగ్యులర్ స్టాఫ్ నర్సుల పోస్టుల ఖాళీలను భర్తీ చేయకుండా కాంట్రాక్టు నర్సులతో విధులు నిర్వహిస్తున్నారని, గత 10 సంవత్సరాలుగా అన్ని రకాల సూపర్ స్పెషలిటీ, కోవిడ్ -19 వంటి విధులు అతి తక్కువ వేతనంతో ఎటువంటి అలవెన్స్ లు లేకుండా పని చేస్తున్నామన్నారు. మూడున్నరేళ్ల జిఎన్ఎం కోర్సు, నాలుగేళ్ల బిఎస్సి నర్సింగ్ కోర్సులు చదివి కొంతకాలంగా ప్రభుత్వాసుపత్రిలో సేవలు చేస్తున్నామని, ఇప్పుడు తమను కాదని సెకెండ్ ఎఎన్ఎంలను స్టాఫ్ నర్సులుగా నియమించేందుకు జీవో.115 ఇవ్వడం అన్యాయమని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో ప్రస్తుతం చేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేశాకే మిగతా వారికి అవకాశం కల్పించాలని, జీవో నెంబర్ 115ని రద్దు చేసేవరకు తాము నిరసన కొనసాగిస్తామని అవసరమైతే తమ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో రెగ్యులర్ స్టాఫ్ నర్సుల యూనియన్ నాయకులు ప్రేమ, కార్యక్రమంలో పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు జి. శైలజ, పి. భారతి, పి.లక్ష్మి, అనుశ్రీ, ఎ. నీలిమ, సిహెచ్ రమణమూర్తి, ఎస్. నారాయణరావు, కె. అరుణ, రాములమ్మ, సంధ్య మిగిలిన కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

ఎస్ఐను మర్యాదపూర్వకంగా కలిసిన వైస్ ఎంపీపీ

విశాలాంధ్ర-డుంబ్రిగుడ : మండలంలో నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన కెల్ల. పాపి నాయుడును స్థానిక మండల వైస్ ఎంపీపీ ఎస్ ఆనంద్రావు శనివారం పోలీస్ స్టేషన్ లో మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి అభినందించారు. అనంతరం మండల సమస్యలపై వివరించి పరిష్కారానికి కృషి చేయాలనికోరినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఉపసర్పంచ్ జగ్గు నాయుడు, నాయుడు పాల్గొన్నారు.

తుఫాను వరద బాధితులకు విరాళాలు అందించాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పార్వతీపురం : తుఫాను వరద బాధితులకు విరాళాలు అందించాలని ఎంఎల్ఏ బోనెల విజయ్ చంద్ర పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని మూడు మండలాలు, పురపాలక సంఘం పరిధిలోగల ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్దమనసుతో విజయవాడ వరద బాధితులకు విరాళాలు ఇవ్వాలని కోరారు. ఉద్యోగులు కూడా ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు ఇచ్చి ఆదుకోవాలని తెలిపారు. కష్టకాలంలో ఉన్నవారిని ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

చట్రాపల్లి ఘటనలో మృతురాలు కుమారి కుటుంబాన్ని ఆదుకోవాలి

విశాలాంధ్ర-జీకే వీధి : మంచి మనసుతో ప్రతి ఒక్కరూ చట్రపల్లి గ్రామస్తులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్నారని, కానీ అందులో ఐదుగురు బాధితులు కేజీహెచ్ ఆసుపత్రిలో డాక్టర్లు వైద్యం అందిస్తున్నారు. వారి కోసం ఎవరు సహాయం చేయడంలేదని వారికి సహాయం చేయాల్సిందిగా వారి బంధువులు కోరుతున్నారు. ఎవరు పరామర్శకు వెళ్లినా గ్రామస్తులకు మాత్రమే సహాయం చేస్తున్నారని, చనిపోయిన కొర్ర కుమారి కుటుంబాన్ని మాత్రం ఎవరు సహాయం చేయటం లేదని బంధువులు వాపోయారు. దయచేసి పెద్దమనస్సుతో ఆలోచించండి బ్రతికున్న వాళ్ళ కోసం ఆలోచిస్తు న్నారు. తప్ప మృతిచెందిన కుమారి కుటుంబాన్ని కూడా ఆదుకోవాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, దాతలు ఆలోచించాలని కొర్ర కుమారి బంధువులు వేడుకుంటున్నారు.

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

విశాలాంధ్ర -పాడేరు: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర కార్యవర్గ సమావేశాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మురళీధర్ రావు, రాష్ట్ర కార్యదర్శి యాచేంద్ర, అఖిల భారత సహ సంఘటన కార్యదర్శి బాలకృష్ణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి సుమన్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని కొనసాగించారు. మొదటి రోజు రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో అక్టోబర్ 27 ,28 తేదీలలో జరగబోయే రాష్ట్ర విశ్వవిద్యాలయాల సమ్మేళనానికి సంబంధించిన గోడ పత్రికని అఖిల భారత సహ సంఘటన కార్యదర్శి శ్రీ బాలకృష్ణ గారి చేతులమీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విశ్వవిద్యాలయాల కన్వీనర్ గౌనిపల్లి కిరణ్ కుమార్, అనంతపురం విభాగ్ కన్వీనర్ అఖిల్, గుంటూరు జిల్లా కన్వీనర్ పవన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వార రాష్ట్రంలోని విశ్వవిద్యాలయంలోని వివిధ సమస్యల మీద చర్చలు నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వెళ్లే కార్యనిర్మాణం ఈ సమ్మేళనంలో జరుగుతుందని నిర్వహకులు చెప్పారు.

సీఎం చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర -సీతానగరం: సెబ్ ఎత్తివేసి అప్పట్లో ఉండే ఎక్సైజ్ శాఖగా ప్రభుత్వం పేరు మార్చడంతో స్థానిక సెబ్ సిబ్బంది శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్ర పటానికి, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ప్రభుత్వ నిర్ణయంపట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయిలో శనివారం అన్ని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని సర్కిల్ ఇన్స్పెక్టర్ జె.శ్రీనివాసరావు తెలిపారు. ఈపాలాభిషేకంలో ఆయనతోపాటు ఎస్ఐ బి. రాజశేఖర్, హెచ్‌సి అప్పలరాజు, సిబ్బంది కే.అప్పన్న, ఎల్.జనార్దనరావు, ఎం.శ్రీవాణిలు పాల్గొన్నారు.

ఆర్ వెంకమ్మపేట పాఠశాలకు ఐదు సీలింగు ఫ్యాన్లను పూర్వ విద్యార్థులు అందజేత

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని ఆర్ వెంకమ్మపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వవిద్యార్థులు (ప్రస్తుతం ఉపాధ్యాయులు) పెంట రామకృష్ణ, పెంట శ్రీరామచంద్రుడు పెంట చిన్ని కృష్ణ, రాగాల శ్రీమన్నారాయణ, పెంట వేణు గోపాలరావులు ఐదు సీలింగు ఫ్యాన్లు అందజేసారు. తాము చదువుకున్న పాఠశాలకు కృతజ్ఞతభావంతో ఈ ఫ్యాన్లు అందించామని చెప్పారు. వారికి పాఠశాల తరుపున హెచ్ఎం, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఐదుఫ్యాన్లు అందజేసిన పూర్వవిద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారులు సూరిదేముడు వెంకటరమణలు కూడా అభినందనలు తెలిపారు.

సబ్ కలెక్టర్ సుడిగాలి పర్యటన

విశాలాంధ్ర-సీలేరు : జీకేవీధి మడలం దారకొండ పంచాయతీ నిమ్మచెట్టు గ్రామంలో సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ పర్యటించారు అక్కడ రైతులను పిలిచి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు చాలా ఎకరాల్లో వరి ఎక్కువగా పోయిందని రైతులు తెలిపారు తర్వాత వ్యవసాయ భూముల్లో పెద్ద పెద్ద రాళ్లు చేరిపోవడంతో వ్యవసాయం చేసుకోలే మనీ ప్రభుత్వం వారే రాళ్లు ఉన్న భూమిని అంతటినీ జెసిబి లతో చదివిన చేసి ఇవ్వాలని సబ్ కలెక్టర్ దఅష్టికి తీసుకువెళ్లారు ఆయన దీనికి స్పందిస్తూ తప్పకుండా పై అధికారులకు ప్రభుత్వం దఅష్టికి తీసుకెళ్తామని ఎంత పంట నష్టం నష్టపోయారు సమగ్ర విచారణ చేసి అందరికీ న్యాయం జరిగేటట్టు చూస్తానని హామీ ఇచ్చారు నిమ్మ చెట్టు తర్వాత గంగవరం బ్రిడ్జి. అలాగే అగ్రహారం బ్రిడ్జి పరిశీలించారు అనంతరం గుమ్మిరేవుల పంచాయితీచోడిరాయి కోతకు గురైన బ్రిడ్జిని చూశారు అనంతరం కమ్మరి తోట లో వరద కొట్టుకుపోయిన వరి పొలాలను పరిశీలించారు ఈ కార్యక్రమంలోదారకొండ సర్పంచ్ నడిగట్ల రాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి సుంకర విష్ణుమూర్తి, అలాగే కాంగ్రెస్ నాయకుడు పోతురాజు మల్లు దొర. కూటమి నాయకులు పోతురాజు కఅష్ణ శెట్టి వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

చామగడ్డ బ్రిడ్జికి తాత్కాలిక రహదారి నిర్మాణం చేపట్టండి

విశాలాంధ్ర-జీకే వీధి : గత వారం క్రితం కురిసిన భారీగా వర్షానికి చామగాడు బ్రిడ్జి పాడవడంతో పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడు తున్నారు. తాత్కాలికి రహదారి ఏర్పాటు చేయాలని అమ్మవారి దారకొండ పంచాయితీ గల గ్రామాలకు గొల్లపల్లి తడకపల్లి, పెబ్బేంపల్లి,చేలక వీధి, దుర్గం, రైలు గడ్డ, జాజిపకలు, ఈ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. కనీసం నిత్యవసర సరుకులు తెచ్చుకోవడం కూడా వీలు లేకుండా వాగు అడ్డంగా ఉండి పోవడం ఉన్నపాటి రహదారి పూర్తిగా దెబ్బతిన్నాయని, ఇలాంటి సమయంలో మా గ్రామాలకు ప్రభుత్వమే ఆదుకోవాలని మొరపెట్టుకుంటున్నారు. సంబంధిత అధికారులు గ్రామాలకు సందర్శించలాన్నారు . బీటి రోడ్డు, కాలువకి బ్రిడ్జి మంజూరు చేసి ఆ గ్రామ ప్రజలకు ఊరట కల్పిస్తారని గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు. ఆ గ్రామాలకు వెళ్లి రహదారి చామగేడ్డ నుంచి సుమారుగా 20 కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి గ్రామాలకు ఈ రహదారి ద్వారా ప్రయాణం సాగిస్తున్నారు మధ్యలో కాలువ ఉంది వర్షాకాలం వాగు దాటులేక ఎంతటి ఎమర్జెన్సైనా ప్రాణుల అర చేతి పెట్టుకొని ఊర్లోనే ఉండిపోవాల్సి ఉంటుంది. వాగు దాటడానికి చాలా కష్టంగా ఉంటుందిని అయినా కూడా ధైర్యం చేసుకుని అత్యవసర విషయంలో ఆస్పత్రికి వెళ్లాలన్న ధైర్యం చేసి వాగు దాటి చేయవలసి ఉంటుందన్నారు. ఇలాంటి సమయంలో ప్రాణమే పోయే పరిస్థితి ఉంటుందనీ ఆదివారం నాడు కురిసిన వర్షానికి కొద్దిపాటి గ్రావెల్ రోడ్డుకి ఇరువైపులా ఉన్నటువంటి చెట్లు రోడ్డుమీద పడిపోయి రోడ్ కూడా పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. సంబంధిత అధికారులు ఆ గ్రామాలకు ప్రత్యామ్నాయంగా ఎమర్జెన్సీ విషయంలో రాకపోకలకు నిత్యవసర సరుకులు తెచ్చుకోవడానికి మార్కెట్ కి వెళ్లాలన్న ఇబ్బందికరంగా ఉంటుందినీ ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి రోడ్డు బ్రిడ్జి మంజూరు చేసే వరకు ప్రత్యామ్యంగా ఏర్పాటు చర్యలు తీసుకోవాలని అధికారులకు గ్రామాల పరిధి ప్రజల తెలుగుదేశం పార్టీ యూత్ ప్రెసిడెంట్ ముర్లా కోటేశ్వరరావు కోరారు.

పశువుల అక్రమ రవాణా చేస్తున్న లారీని పట్టివేత

విశాలాంధ్ర - పాచిపంట : ఒడిస్సా నుండి అక్రమంగా పశువులు రవాణా చేస్తున్న లారీని పాచిపెంట ఎస్సై వెంకట్ సురేష్ శనివారం అదుపులోకి తీసుకున్నారు వివరాలు ఈలా ఉన్నాయి.మండలంలో గల పి కొనవలస అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద లారీనీ అదుపులో తీసుకొని రవాణా చేస్తున్న పశువులను (33) గోసాలకు తరలించినట్లు ఎస్సై వెంకట్ సురేష్ విలేకరులకు తెలిపారు. పోలీసులు వివరాలు ప్రకారం కర్ణాటక రాష్ట్రాము లారీ రిజిస్ట్రేషన్తో పశువులను ఆంధ్రకి తీసుకొస్తుండగా పీ. కోనవలస చెక్ పోస్ట్‌లో శనివారం పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. లారీ డ్రైవర్ పై కేసు నమోదు చేసి డ్రైవర్ అదుపులో తీసుకున్నట్లు తెలిపారు.

బుడ్డిపేట, చినబోగిలిలో ఏచూరికి ఘన నివాళులు

విశాలాంధ్ర-సీతానగరం : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీవ్ర లోటని సిపిఎం పార్టీ నేతలు అన్నారు. సీతారామ ఏచూరి మరణంతో బుడ్డిపేట, చినబోగిలశాఖల సభ్యులు ఏచూరి చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈసందర్భంగా సిపిఎం పార్టీనాయుకులు గవర వెంకటరమణ మాట్లాడుతూ కార్యక్రమంలో పార్టీకమిటీ సభ్యులు ఆర్. రాము, వై. రామారావు, చిన్నారావు, రెడ్డి ఈశ్వరరావు, బొరపరెడ్డి అప్పారావు,చందనపల్లికృష్ణ, రామలక్ష్మి సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

మూలగరువు బాధితులకు వంట సామాగ్రి పంపిణీ

విశాలాంధ్ర-జీకే విధి : మండలంలోని మూలగరువు గ్రామంలో వరద కారణంగా నష్టపోయిన గిరిజనులకు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐ టి డి ఏ పి ఓ అభిషేక్, ఆదేశాల మేరకు మండల తాసిల్దార్ కుమారస్వామి నిత్యవసర సరుకులు, వంట సామాగ్రి, దుస్తులను బాధిత గిరిజనులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మహదేవ్, విఆర్ఓ లింగాలు, కార్యదర్శి బాబుజి, గృహ నిర్మాణ శాఖ ఏఈ సూరిబాబు, తేదేపా మండల అధ్యక్షుడు ముక్కలి రమేష్, మాజీ జడ్పీటీసీ నళినికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీల్లో వెలుగుచూస్తున్న అక్రమాలు

వేతన దారులపై విరుచుకుపడ్డ ఎఫ్ఎ

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఉపాధి హామీ పనులకు (2023-24) ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం మార్గదర్శ కాలను విడుదల చేసి గ్రామాల వారీగా సామాజిక తనిఖీ లు చేపడుతున్నారు. అందులో భాగంగా డిఆర్పి, ఎస్ ఆర్ పి పరిశీలన చేసి లబ్ధి దారుల నుంచి నిజమైన నివేదికను సేక రిస్తున్నారు. అలా సేకరించిన వాటిని గ్రామ సభలో చదివి వినిపించి సభ్యుల తీర్మానాన్ని పొందేందుకు ప్రయత్నించే తరుణంలో వేతన దారులు ఉపాధి సిబ్బంది మధ్య వివాదాలు నెలకొంటు న్నాయి. డిజిటల్ హాజరు వేస్తూ అటెం డెన్స్ మస్టర్ లో దిద్దుబాట్ల పై నిలదీ శారు. కలివరం ఫీల్డ్ అసిస్టెంట్ వేతన దారులపై దుర్భాషలాడుతూ తిరగబ డుతున్నారని కమిటీ ముందు ఆరోపిం చారు. అలాగే డబ్బులు ఇస్తే తప్ప మస్ట ర్ వేయనని చెబుతున్నాడని ప్రశ్నించిన వారిపై విరుచుకుపడుతున్నారని ఆరో పించారు. చేసిన పనికి తగిన వేతనం అందించడం లేదని, మా శ్రమను దోచు కుంటున్నాడని వేతన దారులు కమిటీ సభ్యులకు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ చేసే అక్రమాలు పై 35 మంది సంతకాలు చేస్తూ ఫిర్యాదు చేశారు. ఆడిట్ బృందం మూడు రోజులుగా చేసిన తనిఖీలలో సుమారు 1,50,000 వరకు రికవరీ చేసేం దుకు అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. బృంద సభ్యులు సంబంధిత గ్రామాలలో ఉపాధి పనులకు సంబంధించి వేతన దారుల నుంచి ఇంటింటికి వెళ్లి సేకరిం చిన సమాచారం మండల సామాజిక తనిఖీలు పరిశీలిస్తే కలివరం ఎఫ్ఏ చేసి న దురగాతాలు బయటపడతాయని వేతన దారులు చెబుతున్నారు. గ్రామా లలో వేతన దారులు ఇచ్చిన సమా చా రాన్ని ఫీల్డ్ అసిస్టెంట్ల తప్పిదాలు, పను లు జరిగిన తీరుపై ఆక్షేపణలు స్వీక రించి నమోదు చేసుకున్నారు. బొబ్బిలి పేట, ఎస్ ఆర్ సి పేట, కొరపాం గ్రామాల్లో చనిపోయిన వారి పేరున రెండేళ్లుగా మా స్టర్లు వేసి దోచుకుంటున్నారని విషయం బయటపడింది. గత ఏడాది వాలంటీర్లు వారానికి మూడు రోజులు పని దినాలు కల్పించవలసి ఉండగా కొన్ని గ్రామాల్లో నాలుగు రోజులు కూడా పనికి హాజరైన ట్లు చూపించడం పై ఆక్షేపించారు. ఎక్కువగా డిజిటల్ హాజరు నమోదు చేసి నామినల్ మస్టర్ రోల్ ను దిద్దుబాట్లు చేసి ఉపాధి నిధులను దిగమింగారన్న విషయాలు వెలుగు చూసాయి. వంద రోజుల పని దినాలు కల్పించడం లేదని వేతన దారులు వెల్లడించారు. వంజంగి లో 1,25,000, కొరపాంలో 1,17,000, కలివరంలో 1,50,000, కే మునగవల సలో సుమారు లక్ష రూపాయలు, జొన్న వలసలో లక్ష పదివేలు వరకు ఉపాధి నిధులలో అక్రమాలు జరిగాయని సామా జిక తనిఖీల్లో వెల్లడవుతుంది. వీటిని సంబంధిత సిబ్బంది ద్వారా ఉపాధి ఉన్నతాధికారులు రికవరీ చేయనున్నట్లు తెలుస్తోంది. 2023 -24 ఆర్థిక సంవత్స రానికి గాను కే మునగ వలసలో 69 లక్షల 3550 రూపాయలు 53 పనులకు గాను వేతనదారులకు చెల్లించారు. సైలాడలో 47 పనులకుగాను 54 లక్షల 92,991 రూపాయ లను అందించారు. ఎస్ఆర్సి పేటలో 49 పనులకు గాను 8395,925 రూపాయలు వేతనదారుల ఖాతాలో జమయ్యాయి. బొబ్బిలి పేట లో 34 పనులకు గాను 51,37699 రూపాయలు, కొరపాం లో 24 పనులకుగాను 19 లక్షల 16 వేల రూపాయలు వేతనదారులకు అందించారు. ఈ తనిఖీలలో ఎస్ఆర్పీలు పున్నపు నాయుడు, ఎం తిరుపతిరావు, డిఆర్పీలు ఎల్ మధు లత, పి శ్రీను, కడారి కృష్ణ, కే రామకృష్ణ, ఆర్ రామకృష్ణ, ఈసీ రాము, టిపిలు వేతనదారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం: పౌష్టికాహార వారోత్సవాలను గురువారం 16వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఐ.సి.డి.ఎస్ పి.ఓ నాగరాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువరు బాలింతలు గర్భిణీలకు పౌష్టికాహారాన్ని అందించారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా బిడ్డ ఎదుగుదల బాగుంటుందని, భవిష్యత్ తరాల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందివ్వడం జరుగుతుందని వివరించారు.

విద్యార్థులకు జె.సి.ఐ ప్రతిభా పురస్కారాలు

విశాలాంధ్ర -ఇచ్ఛాపురం : జె.సి.ఐ వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలో పలు విద్యాలయాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జె.సి.ఐ బృంధం పత్రిభా పురస్కారాలు అందించింది. పురుషోత్తపురం మున్సిపల్ పాఠశాల, పంజావీధి మున్సిపల్ పాఠశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఆధిత్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు బహుమతులను జె.సి.ఐ అధ్యక్షులు టి. షణ్ముఖ్ ఆధ్వర్యంలో అందించారు. అనంతరం యువత ఎదుర్కొంటున్న సమస్యలు, దేనిపై యువత ఎక్కువగా మక్కువ చూపుతున్నారు అనే అంశం పై 'వాయిస్ ఆఫ్ యూత్' పేరిట సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో గోరు డిల్లేసు, వెచ్చా సంతోష్, వెచ్చా రాము, ప్రేమ్‌సాయి, రాజ్‌కమల్, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయండి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : మార్పు బాలక్రిష్ణమ్మ పోరాటాలతో ఉపాధ్యాయుల సమస్యలకు చాలా వరకూ ఉపసమనం లభించిందని ఎ.పి.టి.ఎఫ్ జిల్లా ఉపాధ్యాక్షులు ఆర్వీ అనంతాచార్యులు అన్నారు. గురువారం మండలంలో పర్యటించిన ఆయన వివిధ పాఠశాలలను సందర్శించి అక్కడి సిబ్బందితో చర్చించి ఏ.పి.టి.ఎఫ్ ఆవిర్భవించి 80ఏళ్ళు గడిచిన సందర్భంగా విజయనగరంలో నిర్వహించనున్న 20విద్యా వైజ్ఞానిక మహాసభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మండల విద్యాశాఖాధికారి కె. అప్పారావును కలిసి కరపత్రాలు అందించి బూర్జపాడు ఉన్నత పాఠశాల సమస్యలను వివరించి, వ్యాయామ ఉపాధ్యాయులను మండలంలో వివిధ పాఠశాలల్లో నియమించాలని కోరారు.